# ఊహా వాహిని

లాస్య
ఇ.నం. 5-4-27,
క్లబ్‌రోడ్, కామారెడ్డి.



## డియర్ అలేఖ్యా,

నీ లేఖ నిప్పుడే అందుకున్నాను.

వేసవి సాయంకాలాల్లో, మల్లెతోటల నుండి వీచే కమ్మని, చల్లని పిల్లగాలులు ఒక్కసారిగా శరీరాన్ని చుట్టేసినట్లు.. ఉవ్వెత్తున నీ జ్ఞాపకాలు నన్ను చుట్టుముట్టాయి.!

నువ్వు జ్ఞాపకమొస్తే నాకెప్పుడూ ముందుగా గుర్తొచ్చేది నీనవ్వే. నిజంగా నీ నవ్వు ఎంతందమెంది...

"అలా నవ్వకు ఈటె రువ్వకు గుండె స్పందన ఆగనివ్వకు" అని పాడుకోవాలనీ! వేడుకోవాలనీ అన్పిస్తూ ఉంటుంది.

నీ నుండి జాబు అందుకున్నప్పుడల్లా నాకెంత సంతోషంగా ఉంటుందనీ.

వెన్నెల్లో నిలువెల్లా తడిసినట్లూ , సుతిమెత్తని వస్తువేదో చెక్కిళ్ళను సుతారంగా తాకినట్లూ, మువ్వలు అలవోకగా నవ్వి సవ్వడి చేసినట్లూ, సన్నజాజులు సందెవేళల్లో సువాసనలను వెదజల్లినట్లూ.. ఇలా ఎన్నో మరెన్నో భావనలు నన్ను మైమరపిస్తూంటే, అలా అచేతనా వస్థలో ఎంత సేపుంటానో తెలీదు.

ఎప్పటికో తేరుకొని, ఆ అందమైన భావాలను డైరీలో పొందుపరుస్తాను. ఎందుకో తెలుసా..రాసిన వన్నీ నీకు చూపించి, రేఖా విభక్తమైన నీ పెదాలపై కదలాడే ఆ నవ్వును మరోసారి చూడొచ్చనీ...

ఒక్కసారిరా.. నా డైరీ చూడు ఏ పుట చూసినా నా అనుభూతుల గేయాలు. అంతరంగిక నేపథ్యఘోషలు మంద్రంగా విన్పిస్తాయి, కన్పిస్తాయి.

కనురెప్పల ప్రాంగణంలో ఆశల ముగ్గులు వేసి కోర్కెల దీపాల వెలుగుల్లో, ఒళ్ళంతా కళ్ళు చేసుకొని నీరాక కోసం నిరీక్షిస్తూ ఉంటాను.

నా మనసనే తోటలో మోడువారిన చెట్లన్నంటికీ నువ్వొస్తున్నావనే వార్త ఆకులు చిగిర్చడమే కాదు.. ఏకంగా పూలే పూయిస్తుంది!

నండూరి ఎంకి పాటలకి, దేవుల పల్లి భావగీతాలకు మనమే రాగస్రష్టలమై, మనమే గాయకులమై, మనమే శ్రోతలమైన నాటి అనుభూతులతో మనసంతా నిండినపుడు ఆ భావ సామ్రాజ్యానికి నేనొక అధినేతనౌతాను.. నాకు తోడుగా ఈ శుకపికాలు గొంతు విప్పి గత జ్ఞాపకాలను తవ్వి తీయని బాధేదో ఎదనంతా కమ్ముకునేలా చేస్తాయి!

'నీరాకయే వసంత మనుకొనే నాకు... కోకిల గొంతు వింటే గాని వసంతం గుర్తుకురాని నీకు... ఎంత తేడా?' తలచుకొంటే ఎంత సిగ్గేస్తుందనీ?

ఆనాటి నా అంతరంగమొక అందమైన హరివిల్లు.. ఈనాడు నీ జ్ఞాపకాల చిరుజల్లులో తడిసిపోతోన్న పూరి

ఆ స్నేహతొలకరిలో పురివిప్పిన నాటి నా ఆశల నెమళ్ళు, ఎడబాటనే గ్రీష్మంలో దప్పికతో తపిస్తున్నాయీనాడు.

నీ కోసం నిరీక్షించే నా కళ్ళకు కావాలి నాకై చెమర్చే నీ కళ్ళు! నీ సమక్షంలో నా మనసు కోయిలకు నిత్యవసంతం రావాలి!

'ఈ ఉత్తరం చదువుతూ నీవేమనుకుంటున్నావ్'? అని నే ప్రశ్నిస్తే, మౌనంగా నవ్వుతావుగదూ?

మౌనంలో కూడా అందాలుంటాయనీ నిన్ను చూశాకే తెలుసుకున్నాను.

ఎంతయినా... మనసు పుటల్లోని నిశ్శబ్దం.. విన్పించేరాగం కన్నా శ్రావ్యంగా ఉంటుందన్న నీ అభిప్రాయం నాకెంతో ప్రియం!

అప్పట్లో అందమైన సాయంకాలాల్లో పొలాల గట్లపై కూర్చొని, ప్రకృతి అందాలను చూస్తూ, కబుర్లు చెప్పుకుంటూ, ఉన్నట్లుండి వెళ్ళడానికి లేచే నీ చేయి పట్టుకొని ఆపే నాతో...

"పిచ్చీ! వదులు. అందకుండా పారిపోతానని భయమా? లేక మరెవరికో అందుతానని అనుమానమా? మున్ముందు నీ కందనంత దూరం వెళ్ళాల్సి వస్తే, నిన్ను ఒక్కొక్క అడుగే నాతో పాటు నడిపించుకుని వెళ్తాను, అలా నువ్వు రాలేని నాడు ముందుకేసిన ఒక్కొక్కడుగు నీకోసం ఒక్కొక్కటే వెనక్కి వేసి- నీ దాకా నడిచివచ్చి నిన్ను చేరుకుంటాను. సరేనా?" అనే నీ మాటలు నాకిప్పటికీ జ్ఞాపకం!

ఊహా ప్రపంచంలో మనిద్దరి తోటిదే లోకంగా- మన అనుభూతుల మధురిమలను నెమరేసుకుంటూంటే- నేను మరో నీవైనట్లు తప్ప, నీవు మరొకరిలా అన్పించదెంచేతో.

నీ నుండి వచ్చిన లేఖను చదవడం పూర్తి చేస్తున్నప్పుడు నాకెంత దిగులనీ!

మళ్ళీ అంతలోనే ఏదో ఒక ఆశ. చీకటి తర్వాత వచ్చే ఉషస్సులా.. నీ నుండి మరొక జాబు అందుకుంటాననీ!

నీ కోసం.. నీ నవ్వుకోసం.. నీ జాబుకోసం.. నీ స్నేహ హస్తం కోసం.. తపిస్తూ .. తపస్సుచేస్తూ..

యువర్స్ లవ్లీ......